నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

ముగ్గురు మహిళలు, చిన్నారులతోసహా బావిలో ఐదు మృతదేహాలు

జైపూర్, మే 28: ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులతో కలిపి ఐదు మృతదేహాలు ఒక బావిలో కనిపించాయి. మృతుల్లో ఇద్దరు మహిళలు నిండు గర్భిణీలు. ఆ ముగ్గురు మహిళలు కూడా అక్కాచెల్లెల్లు. అలాగే చనిపోయిన పిల్లల్లో ఒకరి వయసు నాలుగేళ్లు కాగా, మరో పసి బిడ్డ వయసు 27 రోజులు. కట్నం కోసం అత్తమామలు వారిని హత్య చేసినట్లు స్థానికులు ఆరోపించారు. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. దూదు పట్టణానికి చెందిన ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులతో కలిసి బుధవారం నుంచి కనిపించలేదు. అయితే వారి ఇళ్లకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని ఒక బావిలో ఐదుగురి మృతదేహాలను శనివారం కనుగొన్నారు. హత్యకు గురైన మహిళలను కలు దేవి, మమత, కమలేష్‌గా గుర్తించారు. వారిలో మమత, కమలేష్ నిండు గర్భవతులని పోలీసులు తెలిపారు. చనిపోయిన ఇద్దరు పిల్లలు కలు దేవి పిల్లలని చెప్పారు.కాగా, కట్నం కోసం అత్తమామలు ముగ్గురు మహిళలు, ఇద్దరు పిల్లలను హత్య చేసినట్లు స్థానికులు ఆరోపించారు. 15 రోజుల కిందట కలు దేవిని అత్తింటి వారు కొట్టారని, దీంతో ఆమె కంటికి గాయమైందని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన వెంటనే ఈ దారుణం జరిగిందన్నారు. బుధవారం కనిపించకుండా పోయిన వారిని వెదకడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపించారు.

హైదరాబాద్ ఆదివారం 29-5-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 239 పేజీలు:4 వెల: రూ.1/-

హరితహారంతో ఆకుపచ్చని తెలంగాణ

హైదరాబాద్, మే 28:తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడానికి సీఎం కేసీఆర్ అనేక భిన్న, విభిన్న పథకాలను ప్రవేశపెట్టారు. అందులో ఒకటి తెలంగాణకు హరితహారం పథకం.

రోజు రోజుకు హరించుకుపోతున్న అడవి. పెరుగుతున్న కాంక్రీట్ జంగల్. పెరుగుతున్న జనాభా వల్ల వాహన, పరిశ్రమల వ్యర్థ కాలుష్యాల వల్ల జీవారణం అంతా అస్తవ్యస్థమైంది. భూభాగంలో కనీసం 33శాతం ఉండాల్సిన అడవి అంతరించిపోయే పరిస్థితి దాపురించింది. దీంతో భూమిపై మొత్తం జీవన ప్రమాణాలే తగ్గిపోయి, అనారోగ్యాలు, అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

దీన్ని గుర్తించిన సీఎం కెసిఆర్ గారు ప్రపంచంలోనే మూడో అతి పెద్ద కార్యక్రమంగా హరిత హారం కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చారు. మొక్కలని నాటి, వాటిని సంరక్షించి, అడవుల శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. కెసిఆర్ హరితహారం స్ఫూర్తితో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లాంటి కార్యక్రమాలు కూడా ఒక ఉద్యమంలా కొనసాగుతున్నాయి.

భూమిపై పచ్చదనాన్ని పెంచేందుకు చైనా, బ్రెజిల్ తర్వాత జరుగుతున్న మూడవ మానవ మహా ప్రయత్నం "తెలంగాణకు హరితహారం"తెలంగాణలో పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో అమలు చేస్తున్నది. గత ఎనిమిదేళ్ళలో 8,511 కోట్ల వ్యయంతో 243 కోట్ల మొక్కలు నాటబడ్డాయి.9 లక్షల 65 వేల ఎకరాల అడవుల పునరుద్ధరణ జరిగింది.నగరాలు, పట్టణాల్లో 109 అర్బన్ ఫారెస్టులు అభివృద్ధి చేయబడ్డాయి. హరితహారంతో తెలంగాణ రాష్ట్రంలో గత నాలుగేళ్లలో గ్రీన్ కవర్ 7.7 శాతం పెరిగినట్లు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొన్నది.ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా వినూత్న పద్ధతిలో, అన్నివర్గాల భాగస్వామ్యంతో "గ్రీన్ బడ్జెట్" ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

పట్టణ, నగర పాలక సంస్థలు, స్థానిక సంస్థలలో కూడా ప్రత్యేకంగా 10శాతం గ్రీన్ బడ్జెట్ ను కేటాయించి, ఖర్చు చేస్తున్నారు.రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలు, ఇతర ప్రతి గ్రామంలోనూ మొక్కలను పెంచేందుకు నర్సరీలను ఏర్పాటు చేశారు.

ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే హరిత హారం కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నారు.ఇతర అన్ని అధికారిక సందర్భాల్లోనూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు మొక్కలు నాటుతున్నారు.పుట్టిన రోజున కూడా మొక్కలు నాటే సంప్రదాయం తెలంగాణలో కొనసాగుతున్నది.మొక్కలు నాటడమే కాదు, వాటిని సంరక్షించే బాధ్యతను స్థానిక సంస్థలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎవరికి వారే తీసుకుంటున్నారు.గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లను సమకూర్చడం వల్ల, అవి మొక్కల సంరక్షణకు కూడా ఉపయోగపడుతున్నాయి.

తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, మే 28: భూమి, ఆకాశం ఉన్నంత వరకు నందమూరి తారక రామారావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన గొప్ప నాయకులు ఎన్టీఆర్ అని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఘననివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక గొప్ప నటుడుగా, ప్రజానాయకుడుగా ఎందరో అభిమానులను తన సొంతం చేసుకొన్నారని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు ఎంతో అభిమానంతో అన్నగారు అని పిలుచుకొనే నందమూరి తారక రామారావు సామాజిక, పౌరాణికం తదితర పాత్రలతో తెలుగు, తమిళం, హిందీ భాషలలో కలిపి దాదాపు 400 పైగా చిత్రాలలో నటించారని గుర్తు చేశారు. అనేక చిత్రాలలో వైవిధ్యభరితమైన పాత్రలెన్నో పోషించి మెప్పించారని తెలిపారు. రాముడు, భీముడు, కృష్ణుడు, కర్ణుడు వంటి అనేక పాత్రలతో తెలుగు వారి హృదయాలలో శాశ్వతంగా, ఆరాధ్య దైవంగా నిలిచిపోయాడని అన్నారు. ఒక రాజకీయ పార్టీని స్థాపించి అతి తక్కువ సమయంలో కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారంటే అది ఆయనకు ప్రజలలో ఉన్న ఆదరణకు నిదర్శనంగా మంత్రి తలసాని పేర్కొన్నారు.

తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్: మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, మే 28: తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన వ్యక్తి ఎన్టీఆర్ అని మంత్రి మల్లారెడ్డి అన్నారు. నటసార్వభౌమునికి భారతరత్న ఇవ్వాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్‌లో మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ నామా నాగేశ్వర రావుతో కలిసి మంత్రి మల్లారెడ్డి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో పోరాటం చేస్తారన్నారు. సీఎం కేసీఆర్.. ఎన్టీఆర్ బాటలో నడుస్తున్నారని చెప్పారు.

ఎన్టీఆర్‌కి భారత రత్న ఇవ్వాల్సిందేనని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం తమ అదృష్టమని చెప్పారు. సూర్య చంద్రులు ఉన్నంత కాలం ఎన్టీఆర్ ఉంటారని టీఆర్ఎస్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఎన్టీఆర్‌లానే సీఎం కేసీఆర్ కూడా మంచి పరిపాలన అందిస్తున్నారని వెల్లడించారు.

ఎన్టీఆర్ ది వ్యక్తిగా, రాజకీయ శక్తిగా విలక్షణ వ్యక్తిత్వం : ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, మే 28: ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆయన్ను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. మావాడు అని తెలుగువారంతా గర్వంగా చెప్పుకునే మహానటుడు, మహా నాయకుడు నందమూరి తారకరామారావు అని వెంకయ్య నాయుడు కొనియాడారు. వ్యక్తిగా, రాజకీయ శక్తిగా ఎన్టీఆర్ ది విలక్షణమైన వ్యక్తిత్వమని పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో, అంత్యోదయ మార్గంలో ఎన్టీఆర్ పరిపాలన సాగిం దని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిలిచి న ఆయన పాలన ఆదర్శంగా నిలిచిం దని ప్రశంసించారు. ఆ మహానాయకుడి స్ఫూర్తిని యువతరం అందిపుచు ్చకోవా లని, నవభారత నిర్మాణంలో భాగస్వా ములు కావాలని వెంకయ్య ఆకాంక్షించారు.

కొత్త హైపర్ సోనిక్ క్షిపణి జిర్కాన్- విజయవంతంగా పరీక్షించిన రష్యా

మాస్కో, మే 28: రష్యా మరో కొత్త హైపర్‌సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. వెయ్యి కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను నాశనం చేసే సత్తా ఉన్న జిర్కాన్ క్షిపణిని బారెంట్స్ సముద్రం నుంచి ప్రయోగించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ వర్గాల ద్వారా తెలిసిందని రాయిటర్స్ వార్తా సంస్థ శనివారం తెలిపింది. సుమారు 1,016 కిలో మీటర్ల (631 మైళ్ళు) దూరంలో ఉన్న తెల్ల సముద్రంలోని లక్ష్యాన్ని ఈ క్షిపణి విజయవంతంగా ఛేదించినట్లు పేర్కొంది. గతంలో కూడా సముద్రం లోపల ఉన్న జలాంతర్గామి నుంచి జిర్కాన్ క్షిపణిని పరీక్షించినట్లు రష్యా తెలిపింది. అధునాతన క్షిపణులు, లేజర్ ఆయుధాలను కలిగి ఉన్న సాటిలేని కొత్త తరం ఆయుధ వ్యవస్థలలో జిర్కాన్ హైపర్‌సోనిక్ క్షిపణి ఒకటని రష్యా అధ్యక్షుడు పుతిన్ అభివర్ణించారు.కాగా, గత నెలలో ఉక్రెయిన్‌లోని లక్ష్యాలపై కింజాల్ హైపర్ సోనిక్ క్షిపణులను ప్రయోగించినట్లు రష్యా తెలిపింది. 1,500 నుంచి 2,000 కిలో మీటర్ల పరిధిలోని లక్ష్యాలను నాశనం చేయగల ఆయుధంగా పేర్కొంది. అలాగే గత నెలలో కొత్త అణ్వాయుధ సామర్థ్యం గల ఖండాంతర క్షిపణి సర్మత్‌ని రష్యా ప్రయోగించింది. పదికిపైగా అణ్వాయుధాలను అమెరికా వరకు మోసుకెళ్లే సామర్థ్యం ఉందని తెలిపింది.

మరోవైపు ఉక్రేనియన్ సైనిక దళాలు ప్రయోగించిన డ్రోన్‌లను పేల్చి వేసేందుకు శక్తివంతమైన కొత్త తరం లేజర్ ఆయుధం జదిరాను గత వారం ప్రయోగించినట్లు రష్యా తెలిపింది. అయితే యుద్ధ నిబంధనల ప్రకారం నిషేధించిన ఇలాంటి ఆయుధాలు ఉక్రేనియన్ డ్రోన్లు లేదా ఫిరంగి దళాలను నాశనం చేయడంతోపాటు సైనికులను అంధులుగా చేస్తాయని పశ్చిమ దేశాల సైనిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన టీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, మే 28:నందమూరి తారకరామారావు శత జయంతి సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్‌లో పలువురు రాజకీయ ప్రముఖులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఘాట్ వద్దకు చేరుకున్న మంత్రులు మల్లారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ నామానాగేశ్వరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కని నరసింహులు, మోత్కుపల్లి నర్సింహులు, మాజీ మంత్రి పరిటాల సునీత, ఇతర టీడీపీ నాయకులు, అభిమానులు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని నివాళులు అర్పించి ఎన్టీఆర్‌ను స్మరించుకున్నారు.

'ఒక తెలుగు బిడ్డగా ప్రపంచ ఖ్యాతి గడించిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన ఆదేశాల మేరకే ఇప్పటికీ ఆయన అభిమానులు పని చేస్తున్నారు. ఆయన ప్రధాన మంత్రి అవ్వాల్సింది.. జస్ట్‌లో మిస్ అయింది.' అని మంత్రి మల్లారెడ్డి అన్నారు. 'ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేస్తాం. రాజకీయాల్లో, సినిమాల్లో ఆయనకు తారాస్థాయిలో అభిమానులున్నారు. పేదల కష్టం తెలుసుకున్న నాయకుడు ఎన్టీఆర్' అని ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన బాటలోనే కేసీఆర్ నడుస్తున్నారని మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మధ్య దళారులు లేకుండా ప్రజలకు అన్ని రకాల సంక్షేమం చేరుకోవాలని ఆకాంక్షించారు. తన వద్ద అర్ధరూపాయి కూడా లేకున్నా.. తనని మంత్రి చేసి.. తనకు పెళ్లి చేసిన గొప్ప మనసున్న వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు.

424 మందికి సెక్యూరిటీ ఉపసంహరించుకున్న ప్రభుత్వం

అమృత్‌సర్, మే 28:పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మరోసారి సంచలన నిర్ణయం తీసుకున్నారు. లంచం అడిగానే ఆరోపణలు రావడంతో గత మంగళవారం ఏకంగా మంత్రినే క్యాబినెట్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్రంలోని 424 మంది ప్రముఖులకు ప్రభుత్వం కల్పించిన భద్రతను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. వారిలో పదవీ విరమణ పొందిన పోలీసులు, మత నాయకులు, రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నారు.

కాగా, ఏప్రిల్ నెలలో పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు సహా 184 మందికి భద్రతను ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. వీరిలో పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ కుటుంబ సభ్యులు, అమరిందర్ సింగ్ కుమారుడు, అతని భార్య, కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రతాప్ సింగ్ బజ్వావర్ కూడా ఉన్నారు.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విజయ్ సింగ్లాను సీఎం మాన్ ఈ నెల 24న మంత్రివర్గం నుంచి తొలగించారు. అవినీతికి సంబంధించి బలమైన ఆధారాలు ఉండటంతో విజయ్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు

హైదరాబాద్, మే 28: రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రెండు, మూడు రోజుల్లో కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని తెలిపింది. ఇదే సమయంలో అరేబియన్ సముద్రం, లక్షద్వీప్‌లోని పలు ప్రాంతాలకు నైరుతి రుతు పవనాలు ప్రవేశించే అవకాశం ఉంది.తెలంగాణలోకి జూన్ 5 నుంచి 10వ తేదీ మధ్యలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్‌లో శనివారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో 38.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే 48 గంటల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండనుంది. ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.



త్వరలోనే కరీంనగర్‌లో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం

హైదరాబాద్, మే 28:కరీంనగర్‌లో టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం అతి త్వరలోనే కార్యరూపం దాల్చబోతుందని మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. అమరావతిలో ఎకరా స్థలంలో నిర్మితమవుతున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్ రావు, టీటీడీ బోర్డు తెలంగాణ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ భాస్కర్ రావుతో కలిసి మంత్రి గంగుల కమలాకర్, వినోద్ కుమార్ శనివారం పరిశీలించారు. కరీంనగర్ నగరం నడిబొడ్డున రూ. 100 కోట్ల విలువ చేసే పది ఎకరాల స్థలాన్ని సీఎం కేసీఆర్ టీటీడీ ఆలయ నిర్మాణం కోసం ఇదివరకే కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ బోర్డు సైతం గతంలోనే ఆమోదం తెలిపింది.

ఆగమ, వాస్తు శాస్త్రం, ఆలయ నిర్మాణ శైలి, గర్భాలయం, అంతరాలయం, అర్థ మండపం, మహా మండపం, ముఖమండపం, గరుడాళ్వార్ సన్నిధి, ధ్వజస్తంభం, బలిపీఠం, తూర్పు రాజ గోపురం, ఉత్తర ద్వారం, ప్రాకార మండపాలు తదితర నిర్మాణ విశిష్టతలను ఆలయ స్థపతులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు ఆలయ ప్రాంగణంలో కలియ తిరిగిన మంత్రి గంగుల సారథ్యంలోని బృందం.. శిలలను ఎక్కడి నుండి తెప్పిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది శిల్పులు పాల్గొంటున్నారు, ఎన్ని రోజుల్లో ఆలయ నిర్మాణం పూర్తవుతుంది తదితర వివరాలను అడిగారు.

అనంతరం టీటీడీ ప్రధాన స్థపతి మునిస్వామి రెడ్డి, సహాయ స్థపతి కృష్ణారావులను తమ వెంట కరీంనగర్‌కు తీసుకెళ్లారు. రేపు టీటీడీ స్థపతులు, కరీంనగర్ రెవెన్యూ యంత్రాంగం, యాదాద్రికి పనిచేసిన ఆనంద్ సాయి తదితరులు కరీంనగర్‌లో ఆలయ నిర్మాణం జరగబోయే స్థలాన్ని పరిశీలించి డిజైన్లు ఇవ్వాల్సిందిగా మంత్రి గంగుల ఆదేశించారు.

నేడు సందర్శించిన అమరావతి ఆలయం కన్నా మరింత సుందరంగా, మరింత విశాలంగా ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం టీటీడీ ఆధ్వర్యంలో కరీంనగర్ ఆలయాన్ని నిర్మిస్తామని గంగుల కమలాకర్ ప్రకటించారు. ఇప్పటికే పూర్వ కరీంనగర్ జిల్లాలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాలేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలకు ధీటుగా కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణం ఉండబోతుందన్నారు.

విశేష సేవలు అందిస్తున్న టీ-డయగ్నొస్టిక్ యాప్

హైదరాబాద్, మే 28:వైద్యరంగంలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. వైద్యసేవలు, అధునాతన వైద్యపరికరాలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంతో ఆరోగ్యకేంద్రాల వివరాలు, వాటి చిరునామా తదితర అంశాలను అరచేతిలోనే ఉంచే విధంగా తెలంగాణ డయాగ్నొస్టిక్ యాప్‌ను రూపొందించడంతో ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నది. సర్కార్ దవాఖాన అంటేనే ప్రాణాల మీద ఆశలు వదులుకునే ప్రజలకు 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సర్కార్ దవాఖానలపైనే ఆశలు పెట్టుకునేలా కార్పొరేట్‌కు దీటుగా వైద్యరంగాన్ని బలోపేతం చేసింది.

అందుబాటులోకి 20 రేడియాలజి ల్యాబ్‌లు

ఉస్మానియా, గాంధీ, నిమ్స్ వంటి దవాఖానలపై భారం తగ్గించేందుకు బస్తీ దవాఖానలను అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం అందులోనే వైద్య సేవలు, 57రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నది. అయితే రోగులకు ఈసీజీ, ఎక్స్-రే, అల్ట్రాసౌండ్‌తో పాటు పూర్తిస్థాయి పరీక్షలు, వైద్యం అందించేందుకు గ్రేటర్ వ్యాప్తంగా 20 టీ-డయాగ్నొస్టిక్ మినీ హబ్‌లను (రేడియాలజి ల్యాబ్) అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే ఇవి ఎక్కడున్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా టీ-డయాగ్నోస్టిక్ యాప్‌ను రూపొందించింది.

తొవ్వ చూపిస్తుంది..

టీ-డయాగ్నొస్టిక్ యాప్ ద్వారా వైద్యసేవలు, ఆరోగ్యకేంద్రాల వివరాలు, వాటి చిరునామా తదితర అంశాలను ఎవరినీ అడగకుండానే మన అరచేతిలోని సెల్‌ఫోన్‌ద్వారా తెలుసుకోవచ్చు. 'నో యువర్ టీ-డయాగ్నొస్టిక్' సెంటర్ ఆప్షన్‌లోకి వెళితే మనకు దగ్గరలో ఉన్న టీ-డయాగ్నొస్టిక్ సెంటర్ ఎక్కడుందో చూపిస్తుంది. జీ-మ్యాప్‌ను ఆన్‌చేస్తే దగ్గరలో ఉన్న టీ-డయగ్నొస్టిక్ సెంటర్‌కు దారి చూపుతుంది. అంతేకాకుండా యాప్‌లోనే రోగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన వివరాలను తెలియజేస్తుంది.

ఏళ్ల తరబడి మెడికల్ రికార్డులు భద్రం

ఒక్కసారి మనం ఏదైన టీ-డయాగ్నొస్టిక్ సెంటర్‌కు వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుంటే ఆ పరీక్షల నివేదికలు టీ-డయాగ్నొస్టిక్ యాప్‌లోని మెడికల్ రిపోర్ట్ అనే అప్షన్‌లో అప్‌లోడ్ అవుతాయి. ప్రిస్క్రిప్షన్‌పై ఉండే రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఎంటర్ చేస్తే సంబంధిత రోగి వైద్యపరీక్షల నివేదిక కనిపిస్తుంది. దీని వల్ల మన దగ్గర ఉన్న ప్రిస్క్రిప్షన్, ప్రింటెండ్ రిపోర్ట్ పోయినా ఎలాంటి సమస్య ఉండదు. అది టీ-డయాగ్నొస్టిక్ యాప్‌లో నిక్షిప్తమై ఉంటుంది. ఇలా 50ఏండ్ల వరకు నివేదికలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

రోగి నుంచి ఫీడ్‌బ్యాక్ ఆప్షన్

అందుతున్న వైద్యసేవలు, వైద్యపరీక్షలపై రోగి నుంచి ప్రతిస్పందన తెలుసుకునేందుకు ఈ యాప్‌లో ఫీడ్‌బ్యాక్ అనే ఆప్షన్‌ను కూడా అందుబాటులో ఉంచారు. దీంతో వైద్యసేవలు లేదా వైద్యపరీక్షలపై రోగి తన ఫీడ్‌బ్యాక్‌ను పంపవచ్చు. దీని వల్ల సిబ్బంది పనితీరును అధికారులు అంచనా వేసే వీలుంటుంది.

చరిత్రలో నేటినిజం

రెండేళ్ల తర్వాత విదేశీ పర్యాటకులకు జపాన్ అనుమతి

టోక్యో, మే 28:జపాన్ రెండేళ్ల తర్వాత విదేశీ పర్యాటకులకు అనుమతిస్తుంది. కరోనా వల్ల విదేశీ పర్యాటకులపై ఆ దేశం ఇన్నాళ్లూ నిషేధం విధించింది. సుమారు 98 దేశాల ప్రజలు తమ దేశానికి టూరిస్టుల్లా వచ్చే రీతిలో జపాన్ మార్పులు చేసింది. గడిచిన రెండేళ్ల నుంచి జపాన్ చాలా తీవ్ర స్థాయిలో కోవిడ్ ఆంక్షలను అమలు చేసింది. టోక్యో ఒలింపిక్స్‌ను కూడా ఓ ఏడాది పాటు ఆలస్యం నిర్వహించిన విషయం తెలిసిందే. విదేశాల్లో నివసించే వారికి, వ్యాపార ప్రయాణికులకు ఇప్పటికే ట్రావెల్ ఆంక్షలను ఎత్తివేశారు.

జూన్ ఒకటో తేదీ నుంచి విదేశీ పర్యాటకుల సంఖ్యను రోజుకు 20వేలకు చేసింది. మార్చి నుంచి విదేశీ విద్యార్థుల ప్రవేశానికి పర్మిషన్ ఇచ్చారు. జూన్ 10వ తేదీ నుంచి టూర్ గ్రూపుల ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు. 2020 నుంచి పర్యాటకులను జపాన్ ఆపేసింది. దీంతో స్థానిక టూరిజం పరిశ్రమ తీవ్రంగా దెబ్బతిన్నది. టూరిస్టులకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ట్రావెల్ ఏజెన్సీలు స్వాగతిస్తున్నాయి.

విశ్వశాంతి, ప్రజా భద్రతే ఊపిరిగా యూయన్ పీస్ కీపర్స్

(29 మే 'అంతర్జాతీయ ఐరాస శాంతి స్థాపకుల దినం' సందర్భంగా)

ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన ప్రపంచ శాంతి సంరక్షణ దళంలోకి (యూయన్ పీస్ కీపిర్స్) 18 – 29 ఏండ్ల వయసున్న యువ స్వచ్ఛంధ సేవా కార్యకర్తలుగా మిలిటరీ, పోలీసు, పౌరులను ఎంపిక చేసి ప్రపంచ పౌర సమాజ రక్షణ, ప్రమాదకర ప్రదేశాల్లో సహాయం, యుద్ధ క్షతగాత్రులను ఆదుకోవడం, ఆకలి చావుల్ని ఆపడం, విపత్తు చేయూత, అశాంతి నెలకొన్న ప్రాంతాల్లో బలగాలను మోహరించడం లాంటి పలు మానవీయ మిషన్లకు నిర్వహిస్తూ ప్రపంచ శాంతి నెలకొల్పే ప్రయత్నాలను ఐరాస శాంతి పరిరక్షణ దళాలు నిర్వహిస్తున్నాయి. అంకితభావం, ధైర్యం, సేవాతత్పరత చూపించే ఐరాస శాంతి స్థాపన దళ సభ్యుల నిస్వార్థ విశ్వహిత విధులను ప్రస్తుతించడం, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వీరులకు నివాళులు అర్పించడం, అసమాన ప్రతిభ కనపరిచిన యోధులకు పురస్కారాలు ప్రదానం చేయటానికి ప్రతి ఏటా 29 మే రోజున 'అంతర్జాతీయ ఐరాస శాంతి స్థాపన దళ దినం (ఇంటర్నేషనల్ డే ఫర్ యూయన్ పీస్ కీపర్స్)' పాటించుట ఆనవాయితీగా వస్తున్నది.

ప్రపంచ శాంతి పరిరక్షణ విధుల్లో అవిశ్రాంతంగా పని చేస్తూ నేటి వరకు దాదాపు 4000 మంది అమరత్వం పొందడం జరిగింది. నేడు ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న కోవిడ్–19 విపత్తు వేళ ఐరాస శాంతి స్థాపక దళం మానవ శ్రేయస్సు కోసం మరింత శ్రమించాల్సి వస్తున్నది. 29 మే 1948న ఐరాస ఏర్పాటు చేసిన శాంతి పరిరక్షణ దళం తొలిసారి మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో అరబ్–ఇజ్రాయిల్ యుద్ధ కాల్పుల విరమణ విధులు నిర్వహించుటతో ప్రారంభమైన దళ ప్రస్థానం నేటికి 72 యూయన్ శాంతి స్థాపన మిషన్లలో ఒక మిలియన్ యువతీయువకులు తమ అమూల్య సేవలను అందించి, అనేక మిలియన్ల ప్రపంచ ప్రజలను కాపాడగలిగారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 14 శాంతి పరిరక్షణ ఆపరేషన్లలో 125 దేశాలకు చెందిన 1,00,000 మిలిటరీ, పోలీసు, పౌరులు శాంతి స్థాపన యజ్ఞంలో తమ సేవలను అందిస్తున్నారు.

అంతర్జాతీయ ఐరాస శాంతి పరిరక్షణ దళ దినం వేదికగా ఐరాస ప్రధాన కార్యాలయం, న్యూయార్క్ వద్ద శాంతి దళ ప్రేమికుల సేవలను కొనియాడడం, 'డగ్ హమ్మర్స్కోల్డ్', 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' పతకాల ప్రదానం, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వీరులకు శ్రద్ధాంజలి ఘటించడం జరుగుతున్నది. యూయన్ పీస్‌కీపర్లుగా మహిళలను కూడా తీసుకోవాలన్న నిర్ణయం ప్రకారం, పలు దేశాల మహిళలు పోలీస్, పైలెట్, మిలిటరీ పరిశీలకులు లాంటి రంగాల ద్వారా ధీరవనితలుగా సేవలందిస్తున్నారు. ఐరాస శాంతి స్థాపన మిషన్లలో ఇండియా ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. ఇప్పటి వరకు 5,400 మంది దేశ బలగాలు సైప్రస్, కాంగో, లెబనాన్, మిడిల్ ఈస్ట్, సూడాన్, పశ్చిమ సహార, సొమాలియా లాంటి పలు ప్రాంతాల్లో విశిష్ట సేవలను అందించడం జరిగింది.

2002లో జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశంలో తీసుకున్న తీర్మానం ప్రకారం 29 మే 2003 నుంచి అంతర్జాతీయ ఐరాస శాంతి స్థాపన దళ దినం పాటించుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ ఐరాస శాంతి స్థాపన దళ దినం–2022 నినాదంగా 'పీపుల్ పీస్ ప్రోగ్రెస్ : ది పవర్ ఆఫ్ పార్ట్‌నర్‌షిప్' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. నేడు ప్రపంచ మానవాళి అనుభవిస్తున్న కరోనా విపత్తు సమయాన ఐరాస శాంతి పరిరక్షణ దళం విభాగపు బాధ్యతలు మరింతగా పెరిగాయి. విశ్వశాంతి, ప్రజా భద్రతే ఊపిరిగా విధులలో ప్రాణాలను సహితం లెక్కచేయక శ్రమిస్తున్న శాంతి యువ కపోతాల సేవలను ప్రస్తుతిద్దాం. ప్రపంచ శాంతి సర్వవ్యాప్తం కావాలని ఆశిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

నారా లోకేశ్‌తో భేటీ అయిన – ఆనం కుమారై కైవల్యారెడ్డి

అమరావతి, మే 28:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నెల్లూరు వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కుమారై..టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తో భేటీ కావడం విశేషం. టీడీపీ మహానాడు జరుగుతున్న నేపథ్యంలో తన భర్త రితేశ్ రెడ్డితో కలిసి ఒంగోలు వచ్చిన కైవల్యా రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తనకు అవకాశం ఇవ్వాలని ఆమె లోకేశ్‌ను కోరినట్లు సమాచారం. దీనిపై లోకేశ్ ఎలా స్పందించారన్నది తెలియరాలేదు. తాజాగా ఇటీవలే జరిగిన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలోనూ ఆనంకి జగన్ అవకాశం ఇవ్వలేదు. ఈ క్రమంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆనం? తన కూతురు నారా లోకేశ్ తో భేటీ జరగడంపై ప్రచారం సాగుతోంది. దివంగత మంత్రి గౌతమ్ రెడ్డి హఠాన్మరణంతో ఖాళీ అయిన ఆత్మకూరు అసెంబ్లీ ఉప ఎన్నికకు ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. ఇలాంటి కీలక తరుణంలో కైవల్యా రెడ్డి నేరుగా నారా లోకేశ్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పీఎం –కుసుమ్ పథకం గురించి సాధారణ ప్రజలకు సూచన జారీ చేసిన ఎంఎన్ఆర్ఈ

హైదరాబాద్, మే 28:నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం–కుసుమ్) పథకాన్ని అమలు చేస్తోంది, ఈ పథకం కింద స్వతంత్ర సోలార్ పంపుల ఏర్పాటుకు మరియు వ్యవసాయ పంపుల సోలారైజేషన్ కోసం సబ్సిడీ అందించబడుతుంది. రైతులు రెండు మెగావాట్ల వరకు గ్రిడ్–కనెక్ట్ చేయబడిన సోలార్ పవర్ ప్లాంట్‌లను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ పథకం రాష్ట్ర ప్రభుత్వాల యొక్క నియమించబడిన ఆయా శాఖలచే అమలు చేయబడుతోంది. ఇలా నియమించబడిన విభాగాల వివరాలు ఎంఎన్ఆర్ఈ వెబ్‌సైట్ లిలిలి.ఎనితీవ.ణనీల.తినిలో అందుబాటులో ఉన్నాయి. పథకం ప్రారంభించిన తర్వాత, కొన్ని మోసపూరిత వెబ్‌సైట్‌లు పీఎం–కుసుమ్ పథకం కోసం తాము రిజిస్ట్రేషన్ పోర్టల్‌గా పేర్కొంటున్నట్టుగా మంత్రిత్వ శాఖ గమనించింది. ఇటువంటి అనధికార వెబ్‌సైట్‌లు పథకంపై ఆసక్తి ఉన్న వ్యక్తుల నుండి డబ్బు మరియు సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాధారణ ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు, ఎంఎన్ఆర్ఈ గతంలో పబ్లిక్ నోటీసులు జారీ చేసింది, ఇలాంటి మోసపూరితమైన వెబ్‌సైట్‌లలో ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజును జమ చేయవద్దని లేదా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సాధారణ ప్రజలకు సూచించింది. ఇలాంటి ఫిర్యాదుల స్వీకరించి, అక్రమార్కులపై కూడా చర్యలు తీసుకున్నారు. అనేక నకిలీ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లను బ్లాక్ చేశారు. ఇలాంటి మోసపూరిత వెబ్‌సైట్‌లతో పాటు, సంభావ్య లబ్ధిదారులను తప్పుదారి పట్టించడానికి వాట్సాప్, ఇతర మార్గాలను కూడా ఉపయోగిస్తున్నారు. అందువల్ల, పీఎం–కుసుమ్ స్కీమ్‌పై ఆసక్తి ఉన్న వ్యక్తులు ఏదైనా వ్యక్తిగత సమాచారాన్ని అందించడానికి లేదా డబ్బు డిపాజిట్ చేయడానికి ముందు వెబ్‌సైట్ యొక్క ప్రామాణికతను తనిఖీ చేసుకోవాలని మంత్రిత్వ శాఖ గట్టిగా సూచించింది. పీఎం–కుసుమ్ స్కీమ్ కోసం రిజిస్ట్రేషన్ పోర్టల్ అని క్లెయిమ్ చేసే వాట్సాప్/ ఎస్ఎంఎస్ ద్వారా స్వీకరించబడిన ఏదైనా ధ్రువీకరించని లేదా అనుమానాస్పద లింక్‌పై క్లిక్ చేయవద్దని మంత్రిత్వ శాఖ ఇంకా సూచించింది. ఈ మేటి పథకంలో పాల్గొనడానికి అర్హత, అమలు ప్రక్రియకు సంబంధించిన సమాచారం ఎంఎన్ఆర్ఈ, వెబ్‌సైట్ స్త్రబిబిజూ://లిలిలి.ఎనితీవ.ణనీల.తిని లేదా పీఎం–కుసుమ్ సెంట్రల్ పోర్టల్ స్త్రబిబిజూబ://జూఎఎబీబబీఎ.ఎనితీవ.ణనీల.తినిలో అందుబాటులో ఉంది: లేదా టోల్–ఫ్రీ సంఖ్య 1800–180–3333కు డయల్ చేయండి

వారిది సామాజిక నయవంచన యాత్ర

అమరావతి, మే 28:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాష్ట్రంలో మంత్రులు నిర్వహిస్తున్నది సామాజిక చైతన్య యాత్ర కాదని నయవంచన యాత్ర అంటూ అనంతపురంలో సామాజిక హక్కుల వేదిక నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మోసం చేస్తు బస్సు యాత్రను నిర్వహిస్తుందని ఆరోపించారు.

కాకినాడలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన మాజీ డ్రైవర్, దళితుడు సుబ్రహ్మణ్యంను హత్యచేస్తే దళిత వర్గాల నుంచి వస్తున్న వ్యతిరేకత నుంచి బయట పడడానికి బస్సు యాత్ర పేరిట కొత్త డ్రామాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టి, ఘర్షణలు చేయించింది అధికార పార్టీ నాయకులేనని ఆరోపించారు. సీఎం జగన్ అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని విరుచుకు పడ్డారు. ఆదివారం అనంతపురానికి వస్తున్న మంత్రుల బస్సు యాత్రను సామాజిక హక్కుల వేదిక అడ్డుకుంటుందని వెల్లడించారు.

ఉక్రెయిన్‌కు కాదు.. స్కూళ్ల భద్రతకు నిధులివ్వండి: ట్రంప్

హూస్టన్, మే 28: ఉక్రెయిన్‌కు నిధులను ఇవ్వడం కాదు.. దేశంలోని స్కూళ్లలో భద్రతను పెంచేందుకు నిధులను కేటాయించాలని అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. కొన్ని రోజుల క్రితం టెక్సాస్‌లో ఓ ఉన్మాది స్కూల్‌లోకి ప్రవేశించి 19 మంది విద్యార్థులను కాల్చిచంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన నేషనల్ రైఫిల్ అసోసియేషన్ హూస్టన్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ సమావేశంలో పాల్గొన్న ట్రంప్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌కు బిలియన్ల డాలర్లను ఇవ్వగలిగినప్పుడు, మన ఇంట్లో మన పిల్లల్ని సురక్షితంగా ఉంచేందుకు కూడా అన్న చర్యలు చేపట్టాలన్నారు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో ట్రిలియన్ల డాలర్లను ఖర్చు చేశామని, కానీ అక్కడ ఏమీ లభించలేదని ట్రంప్ అన్నారు. ప్రపంచ దేశాలను చక్కదిద్దడం కన్నా ముందు మన దేశంలోని స్కూళ్లను పిల్లలకు సురక్షితంగా ఉండేలా మార్చుకోవాలన్నారు. కఠిన తుపాకీ చట్టాల అమలును ట్రంప్ వ్యతిరేకించారు. తమల్ని తాము రక్షించుకునేందుకు ఆయుధాలు అవసరమని ఆయన అన్నారు.

ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో నకిలీ సమీక్షలను తనిఖీ చేయడానికి ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తోన్న కేంద్రం

న్యూఢిల్లీ, మే 28:ఈ–కామర్స్ వెబ్‌సైట్లలో నకిలీ సమీక్షలను తనిఖీ చేయడానికి కేంద్రం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్ (డిఓసీఏ) భారతదేశంలోని ఈ–కామర్స్ సంస్థలు అనుసరిస్తున్న ప్రస్తుత మెకానిజం మరియు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసిన తర్వాత ఈ ఫ్రేమ్‌వర్క్‌లను అభివృద్ధి చేస్తుంది.

అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సిఐ)తో కలిసి డిఓసీఏ, ఈ–కామర్స్ సంస్థలు, వినియోగదారుల ఫోరమ్‌లు, న్యాయ విశ్వవిద్యాలయాలు, న్యాయవాదులు, ఫిక్కి, సిఐఐ, వినియోగదారుల హక్కుల కార్యకర్తలు మరియు ఇతర వాటాదారులతో కలిసి వెబ్‌సైట్లలో నకిలీ సమీక్షలపై రాబోయే పరిమాణం మరియు రోడ్‌మ్యాప్ గురించి ఒక సమావేశంలో చర్చించింది.

ఉత్పత్తిని భౌతికంగా వీక్షించడానికి లేదా పరిశీలించడానికి ఎటువంటి అవకాశం లేకుండా వర్చువల్ షాపింగ్ అనుభవాన్ని ఈ–కామర్స్ కలిగి ఉంటుంది. కాబట్టి వినియోగదారులు ఇప్పటికే ఆ సేవను లేదా వస్తువును కొనుగోలు చేసిన వినియోగదారుల అభిప్రాయం మరియు అనుభవాన్ని చూడటానికి ఈ–కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేసిన సమీక్షలపై ఎక్కువగా ఆధారపడతారు.

''సమీక్షకుడి ప్రామాణికతను నిర్ధారించడం ద్వారా గుర్తించదగిన మరియు ప్లాట్‌ఫారమ్ యొక్క అనుబంధిత బాధ్యత ఇక్కడ రెండు ప్రధాన సమస్యలు. అలాగే ఈ–కామ్ సంస్థలు నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా వ్యవహరించడానికి"అత్యంత సంబంధిత సమీక్షలను'' ఎలా ఎంచుకుంటారో వెల్లడించాలి" అని డిఓసీఏ సెక్రటరీ శ్రీ రోహిత్ కుమార్ సింగ్ అన్నారు.

ఈ సమస్యను నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని మరియు వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం సమస్యను పరిష్కరించడానికి నకిలీ సమీక్షలను నియంత్రించే తగిన ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయవచ్చని వాటాదారులందరూ అంగీకరించారు.

ఈ–కామర్స్ కంపెనీల వాటాదారులు తాము నకిలీ సమీక్షలను పర్యవేక్షించే ఫ్రేమ్‌వర్క్‌లను కలిగి ఉన్నామని మరియు ఈ సమస్యపై చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంలో పాల్గొనడానికి సంతోషిస్తున్నామని పేర్కొన్నారు.

సెక్రటరీ డిఓసిఏతో పాటు అదనపు కార్యదర్శి శ్రీమతి నిధి ఖరే, జాయింట్ సెక్రటరీ అనుపమ్ మిశ్రా ఈ సమావేశానికి హాజరయ్యారు. శ్రీమతి మనీషా కపూర్, సీఈఓ, ఏఎన్‌సిఐ, నకిలీ మరియు తప్పుదారి పట్టించే సమీక్షల వర్గాలను మరియు వినియోగదారుల ఆసక్తిపై వాటి ప్రభావాన్ని హైలైట్ చేశారు. చెల్లింపు సమీక్షలు, ధృవీకరించలేని సమీక్షలు మరియు ఇన్సెంటివ్ చేయబడిన సమీక్షల విషయంలో బహిర్గతం చేయకపోవడం, వాస్తవ సమీక్షలను గుర్తించడం వినియోగదారులకు సవాలుగా మారడం వంటి అంశాలు సమావేశంలో చర్చించారు.

తెనాలిలో ఎన్టీఆర్ సినిమా ప్రదర్శనలు అభినందనీయం- నందమూరి బాలకృష్ణ

అమరావతి, మే 28: కళలకు కాణాచిగా వాసికెక్కిన ఆంధ్రా పారిస్ తెనాలిలో ఎన్టీఆర్ చిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎన్టీఆర్ తనయుడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. స్థానిక పెమ్మసాని థియేటర్ లో మాజీ మంత్రి తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథి ; గా పాల్గొన్నారు.తొలుతఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అని నినదించిన ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు సుపరి పాలన అందించారన్నారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ సినిమాలు ఏడాదిఎ ాటు వారానికి ఐదు రోజులు ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మళ్లీ జన్మంటూ ఉంటే తాను తెలుగువాడి గానే పుడతానని ఆకాంక్షించారు. ఓటును నోటుతో కాకుండా దాని పవిత్రత కాపాడాలని ఆయన కోరారు. ప్రస్తుత పరిపాలన చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరారని దానిని మన్నించి రాష్ట్ర ప్రజలు ఆయనకు పట్టం

కడితే, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి ప్రజలు కొనుగో లు శక్తి కోల్పోయి విలవిలాడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని కోరుకునే తమను రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల ఆశీర్వదించాలని కోరారు. తన రాక సందర్భంగా నంది వెలుగు నుండి తెనాలి వరకు ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ ని చూస్తుంటే ఎన్టీఆర్ కళ్ళ ముందే కనపడుతున్నారన్నారు. రాష్ట్రంలో దుష్టపాలన అంతమొందించి ప్రజలకు సంక్షేమాన్ని అందించే తెలుగుదేశం పార్టీకి ప్రజల మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు, కార్యక్రమంలో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ,నక్కా ఆనందబాబు,బుర్ర సాయి మాధవ్, జాని భాష, ఈదర వెంకట పూర్ణచంద్, పెమ్మసాని శ్రీను, మంగమూరి హరి ప్రసాద్, గుమ్మడి ప్రసాద్, కుద్దూస్, పిన్నారావు, త్రిమూర్తి, మల్లవరపు విజయ్, బోయపాటి అరుణ, దివి అనిత, దేసు యుగంధర్, కొల్లూరు శ్రీధర్, శాఖమూరి చిన్నా , సురేంద్ర, దోగుపర్తి విజయ్, గిరి గణేష్, తాడిబోయిన హరి ప్రసాద్, కనకరాంబాబు, కుదరవల్లి శ్రీనివాసరావు,డా. పాటిబండ్ల దక్షణమూర్తి, డా. వేమూరి శేషగిరిరావు, మాదల కోటేశ్వరరావు తదితరులు పార్టీ శ్రేణులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 25 రోజుల కౌంట్ డౌన్ సందర్భంగా హైదరాబాద్‌లో వేలాది మందితో యోగా ఉత్సవ్

న్యూఢిల్లీ, మే 28:అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడివై 2022)కు 25 రోజుల కౌంట్ డౌన్ ను పురస్కరించుకుని అన్ని రంగాలకు చెందిన వేలాది మంది ఈ రోజు హైదరాబాద్ లో యోగా ఉత్సవ్ లో పాల్గొన్నారు. తెలంగాణ

కార్యక్రమాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథి తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ తో పాటు కేంద్ర ఆయుష్, ఓడరేవులు, షిప్పింగ్ , జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జి కిషన్ రెడ్డి; ఆయుష్ , డబ్లూ సి డి శాఖల సహాయ మంత్రి డాక్టర్ ముంజ్‌పరా మహేంద్రభాయ్ కాళూభాయ్; తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య, వైద్య ,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ తన్నీరు హరీష్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'మీ జీవితంలో యోగాను భాగం చేసుకోండి.' అనే ఇతివృత్తంతో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా (ఎం డి ఎన్ ఐ వై) ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది, ఇందులో 10,000 మందికి పైగా యోగా ఔత్సాహికులు కామన్ యోగా ప్రోటోకాల్ (సి వై పి) ప్రదర్శించారు.ఈ సెషన్ కు ఎండీఎన్ ఐవై డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర్ వి.బసవరాడ్డి దర్శకత్వం వహించారు. యోగా లోని వివిధ కోణాలు , మానవ జీవితాలను సుసంపన్నం చేసే దాని సామర్థ్యం గురించి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. యోగాను మీ జీవితంలో ఒక భాగంగా చేసుకోండి" అనే ఇతివృత్తం తో కూడిన ఈ ఉత్సవ్ కు క్రీడలు, సినిమా, సాంస్కృతిక రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు హాజరై ఇతర యోగా ఔత్సాహికులతో కలిసి సివైపిని ప్రదర్శించారు.

ఈ సందర్భంగా శ్రీ శర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, యోగాను మన జీవితంలో ఒక భాగం చేసుకోవడం ద్వారా మన సుసంపన్న మైన వారసత్వాన్ని మనం సెలబ్రేట్ చేసుకోవాలని ఇది మన ఆరోగ్యాన్ని, మనస్సును వికసింప చేస్తుందని అన్నారు.

జూన్ 21న మైసూరులో జరిగే 8వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఈరోజు కౌంట్ డౌన్ ఉత్సవం విజయవంతం కావడం మరింత ఊపునిస్తుందని, అక్కడ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఔత్సాహికులు, అభ్యాసకులు యోగాను విస్తృతంగా నిర్వహించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తారని ఆయన అన్నారు.ఈ యోగా ఉత్సవ్ వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే, మన వేల సంవత్సరాల నాగరికత అందించిన అద్భుతమైన బహుమతి యోగాను స్వీకరించేలా ప్రజలనుప్రోత్సహించడమని, , తద్వారా వారు వారి జీవన నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చునని కేంద్ర మంత్రి అన్నారు.

"గార్డియన్ రింగ్" అని పిలువబడే మరొక ప్రధాన ఆకర్షణను శ్రీ సోనోవాల్ ప్రకటించారు, దీని ద్వారా యోగా దినోత్సవం రోజున ప్రపంచవ్యాప్తంగా జరిగే యోగా వేడుకలు ఆ రోజు అంతటా ప్రసారం చేయబడతాయి.ప్రతి సంవత్సరం, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విదేశాల్లోని మిషన్లు యోగా కార్యకలాపాలను నిర్వహిస్తాయి. గార్డియన్ రింగ్ వివిధ మిషన్‌ల నుండి ఫీడ్‌ని కలిపి స్ట్రీమింగ్ చేస్తుంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు సూర్యోదయ భూమి అయిన జపాన్ నుండి స్ట్రీమింగ్ మొదలవుతుంది.ఆపై, పశ్చిమం వైపు కదులుతుంది. సూర్యుడు ఉదయించినప్పుడు, ఇతర దేశాల నుండి ప్రసారం అవుతుంది. డీడీ ఇండియాలో ఇది ప్రత్యక్ష ప్రసారమవుతుంది. "ది గార్డియన్ రింగ్" "ఒక సూర్యుడు, ఒక భూమి" భావనను ఆవిష్కరిస్తుంది. యోగా ఏకీకరణ శక్తిని ప్రదర్శిస్తుంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారతదేశం అంతటా 75 ప్రముఖ ప్రదేశాలలో రన్ అప్ ఈవెంట్ గా జరిగే ఈ యోగా ఉత్సవ్‌లలో దాదాపు 25 కోట్ల మందికి పైగా పాల్గొంటారని మంత్రి తెలిపారు.

న్యూఢిల్లీ, మే 28:యోగా ఉత్సవ్ ను ఐదు పురావస్తు ప్రదేశాలలో –రాఖీగారి (హర్యానా), హస్తినాపూర్ (ఉత్తర ప్రదేశ్), శివసాగర్ (అస్సాం), ధోలవీర (గుజరాత్) ఆదిచనల్లూర్ (తమిళనాడు)– లో కూడా నిర్వహించారు. ఇవి భారతదేశం లో "ఐకానిక్" సైట్‌లుగా గుర్తింపు పొందాయి. ఐ డి వై 2022కి 100 రోజుల కౌంట్‌డౌన్ గుర్తుగా కర్టెన్ రైజర్ ఈవెంట్ మార్చి 13న జరుపుకోగా, ఢిల్లీలోని ఎర్రకోటలో 75 రోజుల కౌంట్‌డౌన్ ఈవెంట్ నిర్వహించబడింది. దీని తర్వాత మే 2, 2022న అస్సాం శివసాగర్‌లోని శివ దౌల్ ఆలయ సముదాయంలో 50 రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమం జరిగింది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమం కర్ణాటకలోని మైసూరులో జరగనున్నాయి, అక్కడ భారత ప్రధాని నరేంద్ర మోదీ సామూహిక యోగా ప్రదర్శనకు నాయకత్వం వహిస్తారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం మునుపటి ఎడిషన్‌ల ముఖ్యాంశాలు , విజయాలను ప్రదర్శించడానికి మైసూరులో డిజిటల్ యోగా ప్రదర్శనను కూడా నిర్వహించాలని మంత్రిత్వ శాఖ యోచిస్తోంది.ఎగ్జిబిషన్‌లో యోగా బలం, ఉత్తమ అభ్యాసం, పరిశోధన ముఖ్యాంశాలు, సాధారణ యోగా ప్రోటోకాల్ మొదలైనవి కూడా ఉంటాయి.

ప్రపంచవ్యాప్తంగా యోగా సందేశాన్ని విస్తృత జనావళికి తీసుకెళ్లడానికి మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎనిమిదవ ఎడిషన్ ఊరించి అనేక కార్యక్రమాల ద్వారా ప్రచారం చేస్తోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం, 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా భారతదేశ బ్రాండ్‌కు పునరుజ్జీవం కల్పించడానికి యోగా ఉత్సవ్‌ను చారిత్రక ప్రాముఖ్యత కలిగిన 75 వారసత్వ ప్రదేశాలలో జరుపుకుంటున్నారు.యోగా ద్వారా వెల్నెస్ దిశగా సాగే ఈ ఉద్యమాన్ని గొప్ప విజయవంతం చేసేందుకు ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, రక్షణ దళాలు , ఇతర యూనిఫాం సేవా సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి.

ఈ ఉద్యమం పరిధిలోకి ప్రతి ఒక్కరినీ తీసుకురావడానికి, ఆయుష్ మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలతో మమేకం అవుతోంది. ఇది ఉద్యమాన్ని పట్టణ ప్రాంతాలను దాటి భారతదేశ నడి మధ్యకు తీసుకెళ్తుంది. గ్రామీణ ప్రాంతాల నుండి మరింత ఎక్కువ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

నారా లోకేశ్‌తో భేటీ అయిన –ఆనం కుమారై కైవల్యారెడ్డి

అమరావతి, మే 28:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నెల్లూరు వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కుమారై..టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తో భేటీ కావడం విశేషం. టీడీపీ మహానాడు జరుగుతున్న నేపథ్యంలో తన భర్త రితేశ్ రెడ్డితో కలిసి ఒంగోలు వచ్చిన కైవల్యా రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తనకు అవకాశం ఇవ్వాలని ఆమె లోకేశ్‌ను కోరినట్లు సమాచారం. దీనిపై లోకేశ్ ఎలా స్పందించారన్నది తెలియరాలేదు. తాజాగా ఇటీవలే జరిగిన మంత్ర

పల్లె ప్రగతిని విజయవంతం చేయాలి : మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

జనగామ, మే 28: పల్లె ప్రగతిని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా మన పల్లెలు బాగు పడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో ముందంజలో ఉందన్నారు. గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు పల్లె ప్రగతి కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 3వ తేదీ నుండి చేపట్టనున్న 5వ విడత పల్లె ప్రగతి, నాలుగో విడత పట్టణ ప్రగతి సన్నాహక సమీక్ష సమావేశాన్ని జనగామ కలెక్టరేట్‌లో మంత్రి ఎర్రబెల్లి శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ప్రణాళికాబద్ధంగా చేపట్టడమే విజయానికి కారణంగా పేర్కొన్నారు. పల్లె ప్రగతిలో 20 పంచాయతీలు గుర్తింపు పొందగా అందులో 19 పంచాయతీలు జనగామ జిల్లాలో ఉండటం గర్వకారణంగా పేర్కొన్నారు. అధికారులు గ్రామస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ నిత్యం ఇంటింటికి చెత్త సేకరణ జరగాలన్నారు. సేకరించిన చెత్త సెగ్రిగేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్మి కంపోస్టు చేపట్టి గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచాలన్నారు. వైకుంఠధామాల నిర్వహణ తప్పనిసరిగా జరగాలన్నారు. వైకుంఠధామాల్లో పూల మొక్కలతో ఫెన్సింగ్ చేపట్టాలని నీటి సౌకర్యం కల్పించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు.

తప్పుడు రాజకీయాలు ప్రజలు ఆమోదించరు : చంద్రబాబు

అమరావతి, మే 28:ఏపీలో తప్పుడు రాజకీయాలు చేసే వారిని ప్రజలు ఆమోదించరని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తెలుగు జాతి వెలుగు, పౌరుషం నందమూరి తారక రామారావు అని అన్నారు. ఆయన యుగ పురుషుడని అన్ని రంగాల్లో ఆయనకు ఆయనే సాటి అని ప్రశంసించారు.

అధికారం కోసం ఎన్టీఆర్ రాజకీయంలోకి రాలేదని తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం, పేద ప్రజల అండగా ఉండేందుకు వచ్చారనిఅన్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం నేడు దేశానికే ఆహార భద్రత అయ్యిందని వెల్లడించారు. ఎన్టీఆర్ పరిపాలన దక్షుడు, సంస్కార వాది అని ప్రశంసించారు. సామాన్య కుటుంబంలో పుట్టిన వ్యక్తి అంచెలంచెలుగా ఎదిగారని పేర్కొన్నారు.

ఒంగోలు జిల్లా టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని అన్నారు. టీడీపీ మహానాడుకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా ప్రజలు టీడీపీ వైపే ఉన్నారని తెలిపారు. మహానాడును చూసి జగన్‌తో సహా వైసీపీ నాయకులు గుండెలు పగిలేలా జనాలు తరలిరావాలని కోరారు. తప్పుడు రాజకీయాలను ప్రజలు ఆమోదించరని జగన్ తెలుసుకోవాలని సూచించారు.

ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

రాజన్న సిరిసిల్ల, మే 28:(నేటినిజం ప్రతినిధి):తెలుగు జాతి ఔనత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ప్రియతమ నాయకులు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పులకు నాంది పలికిన యుగపురుషుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు శతజయంతి సందర్భంగా జరుగుతున్న మహానాడును ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుపుకోవడం తెలుగుదేశం పార్టీ సాంప్రదాయమని, ఒంగోలు లో నిర్వహిస్తున్న మహానాడులో భాగంగా సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఎగురవేసి కేక్ చేసి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రగతి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీని ప్రజలందరూ ఆదరించి, ఆశీర్వదించాలని వారు కోరారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ప్రజలు నమ్ముతున్నారని పేర్కొన్నారు.ప్రపంచ సినీ చరిత్రలో దశాబ్దాలపాటు జనరంజకమైన పాత్రలను పోషించి అందరిని మెప్పించిన విలక్షణ నటుడు నందమూరి తారక రామారావు అని, తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని కాపాడటమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీని హైదరాబాద్ నడిబొడ్డున స్థాపించి ప్రజల్లో అట్టడుగు వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన మహా వ్యక్తి అని వారు కొనియాడారు. బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేయడంలోను, పేదవాడికి కూడు, గుడ్డ, నీడ కల్పించిన ఎన్టీఆర్ ను తెలుగు ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు.తెలుగుదేశం పార్టీ 40వ వసంతాల వేడుకలు, ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు కలిపి ఈ ఏడాది క్షేత్రస్థాయిలో పలు కార్యక్రమాలు. ప్రతి రోజు పండుగల నిర్వహించాలని అలాగే తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గడప గడపకు చేరే విధంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు కార్యక్రమాలు తీసుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులను కోరడం జరిగింది.ఏ5కార్యక్రమంలో పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆవునూరి దయాకర్ రావు,టీఎన్ ఎస్ ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మోతె రాజిరెడ్డి, టీఎన్ ఎస్ ఎఫ్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు శ్యాగ ప్రశాంత్,పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన వేంకటేశం, పట్టణ ఉపాధ్యక్షుడు ఆయుబుఖాన్ ,మైనార్టీ పట్టణ అధ్యక్షుడు సలీం, జిల్లా మహిళ నాయకురాలు అల్లం శివమ్మా,గజ్జె భాస్కర్, మెర్గ్ సుదర్శన్,జెట్టి కొమురయ్య,పండుగ స్వామి, బత్తిని తిరుపతి, నల్ల నరేష్, అబ్బాగోని బాలయ్య, అడెప్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు....

సూక్ష్మ & చిన్నతరహా పరిశ్రమల సమూహాల అభివృద్ధి కార్యక్రమం (ఎంఎస్ఇ-సిడిపి) నూతన మార్గదర్శకాల ఆమోదం

న్యూఢిల్లీ, మే 28:సూక్ష్మ ఉ చిన్నతరహా పరిశ్రమల సమూహాల అభివృద్ధి కార్యక్రమం (మైక్రో ఉ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం - ఎంఎస్ఇ- సిడిపి)కి నూతన మార్గదర్శకాలను ప్రభుత్వం ఆమోదించింది. వీటిని 15వ ఆర్థిక కమిషన్ కాలంలో వీటిని అమలు చేయనున్నారు. దిగువన పేర్కొన్న చొరవల ద్వారా సూక్ష్మ ఉ చిన్న తరహా పరిశ్రమల ఉత్పాదకతను, పోటీతత్వాన్ని పెంచడమే ఈ పథకం లక్ష్యం. అవి -

సాధారణ సౌకర్య కేంద్రాలు (సిఎఫ్‌సిలు)ః ప్రాజెక్టు విలువ రూ. 5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు అందులో 70%గానూ, ఒకవేళ ఆ విలువ రూ 10 కోట్ల నుంచి రూ. 30 కోట్లుగా ఉంటే 60గీగా ఉంటుంది. ఇక ఈశాన్య ప్రాంతాలుఉ కొండ ప్రాంత రాష్ట్రాలు, ద్వీప ప్రాంతాలు, ఆకాంక్షిత జిల్లాలలో ప్రాజెక్టు విలువ రూ. 5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఉన్నప్పుడు అందులో 80%గా, రూ. 10 కోట్ల నుంచి రూ. 30 కోట్ల విలువ కలిగిన ప్రాజెక్టులలో 70%గా కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు ఉంటాయి. ఒకవేళ ప్రాజెక్టు విలువ రూ. 30 కోట్లకన్నా ఎక్కువగా ఉన్నప్పుడు సిఎఫ్‌సికి ప్రాజెక్టును కూడా పరిగణనలోకి తీసుకుని, రూ. 30వేల కోట్లను గరిష్ట ప్రాజెక్టు విలువగా భావించి, ప్రభుత్వ సాయాన్ని అంచనా వేస్తారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిః నూతన పారిశ్రామిక ఎస్టేట్ / అంతస్తులు కలిగిన పరిశ్రమల సముదాయం ఏర్పాటుకు ప్రాజెక్టు విలువ రూ. 5 కోట్ల నుంచి రూ. 15 కోట్లు ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను 60%కి పరిమితం చేశారు. ఇక, ఉ నికిలో ఉన్న పారిశ్రామిక ఎస్టేట్ / అంతస్తులు కలిగిన పరిశ్రమల సముదాయాన్ని ఆధ/ నఇకరించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు విలువ రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్లుగా ఉంటే అందులో ప్రభుత్వ గ్రాంటు 50%గా ఉంటుంది. ఈశాన్య ప్రాంతాలుఉ కొండ ప్రాంత రాష్ట్రాలు, ద్వీప ప్రాంతాలు, ఆకాంక్షిత జిల్లాలలో నూతన పారిశ్రామిక ఎస్టేట్ / అంతస్తులు కలిగిన పరిశ్రమల సముదాయాన్ని నిర్మించేందుకు ప్రాజెక్టు విలువ రూ. 5 కోట్ల నుంచి రూ. 15క కోట్లుగా ఉంటే ప్రభుత్వ గ్రాంటు 70%గా ఉండగా, ఉ నికిలో ఉన్న పారిశ్రామిక ఎస్టేట్ / అంతస్తుల పరిశ్రమల సముదాయ ఆధునికీకరణకు ఉద్దేశించిన ప్రాజెక్టు విలువ రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్ల వరకు ఉన్నప్పుడు ప్రభుత్వ గ్రాంటు అందులో 60% గా ఉంటుంది. మౌలిక సదుపాయాల కోసం ఉ ద్దేశించిన ప్రాజెక్టు విలువ రూ. 10 నుంచి 15 కోట్లకు వరకు ఉన్నప్పటికీ, దాని గరిష్ట విలువను రూ. 10 కోట్లుగా పరిగణించి అందుకు అనుగుణంగా గణన చేసి ప్రభుత్వ సాయాన్ని అందిస్తారు.

ఎంఎస్ఇ- సిడిపికి సంబంధించిన నూతన మార్గదర్శకాలు దిసి కార్యాలయం (ఎంఎస్ఎంఇ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

పెరిగిన కూరగాయల ధరలతో.. బెంబేలెత్తుతున్న వినియోగదారులు

హైదరాబాద్, మే 28: ఆగకుండా పెరుతున్న కూరగాయాల ధరలు వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేస్తుండటంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ధరలు పెరుగుతున్న వేగంగా తమ వేతనాలు పెరగకపోవడంతో అర్ధకాలితో కొంతమంది మంది ఉంటుంటే మరి కొంతమంది ఒక పూట భోజనంతోనే జీవితాలను భారంగా నెట్టుకొస్తున్నారు. పెరిగిన ధరల కారణంగా సామాన్య మానవుని మంచి పోషకాలను అందించే పప్పు ధాన్యాలు ఏవీ కూడా రూ.200లకు ఇంచుమించు ఏది తక్కువగా ఉండటం లేదు. కంది పప్పు ధర చూసుకుంటే రిటెల్ మార్కెట్ రూ.200 పలుకుతోంది. కంది పప్పుకు బదులుగా వాడుకునే బెంగుళూరు కందిప్పు(ఎర్రపప్పు) రూ.140 తక్కువగా లేదు. మిననప్పు రూ.180, వేరు శనగలు రూ.175 ఈ విధంగా ఏది పప్పు ధర చూసుకున్నా సామాన్య మానవునికి అందుబాటులో లేదు.

సామాన్యుని జీవని విధానం పైన ప్ర భావం చూపిస్తున్న పెరిగిన కూరగాయల ధరలతో ఏం తినేటట్లు లేదు. ఏం కొనేటట్టు లేదు అనే పరిస్థితి నెలకొంది. సామాన్య మధ్య తరగతికి భారం. బీరకాయ, దోసకాయ, వంకాయ ఇలా చెప్పుకుంటూ.. వెళ్తే అన్ని కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. నిత్యావ సర వస్తువుల ధలతో పాటు కూరగాయల ధరలు ఆకాశాన్నంటడంతో వినియోగదారులు అందోళన చెందుతున్నరు. పండించిన రైతులే అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మార్కెట్‌లో కూరగాయల ధరలతో పాటు నిత్యవసర వస్తువుల నూనెలు, విపరతీంగా పెరిగి కొనలేని పరిస్థితి నెలకొంటోంది. టమాట కిలో రూ.40, వంకాయ కిలో రూ.50, బెండకాయ కిలో రూ.60, పచ్చిమిర్చి 80, కాకరకాయ కిలో రూ.60, ఫ్రెంచ్ బీన్స్‌కిలో రూ.100, క్యారెట్ కిలో రూ.50 పలుకుతుంది. దీంతో వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. ఈ విధంగా వేటి ధరలు చూసిన భగ్గుమంటున్నారు. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఏం కానాలో? ఏం తినాలో దిక్కుతోచని స్థితి సామాన్య మానవుడు సతమతం అవుతున్నాడు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ని ఆదరించండి - సీతక్క

హైదరాబాద్, మే 28:ములుగు మండలం లోని బండారు పల్లి గ్రామములో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు డిక్లరేషన్ రచ్చ బండ కార్యక్రమం ముఖ్య అతిథిగా హాజరైయ్యారు కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి ములుగు ఎమ్మెల్యే సీతక్క..

ఈ సందర్భంగా మాట్లాడుతూ ..తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీనీ ఆదరించండి అని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు కెసిఆర్ చేసింది ఏమి లేదని, ఎన్నికల సమయంలో ఏక కాలంలో రైతు రుణమాఫీ చేస్తా అని, పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇస్తా అని, రైతులకు ఎరువులు మరియు విత్తనాలు ఉచితంగా ఇస్తానని దొంగ హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిన కెసిఆర్ గారు వరి వేస్తే ఉరి అనే పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందని, రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన ఎవుసం బాగుపడ్డ చరిత్ర లేదని, ముఖ్య మంత్రి కెసిఆర్ మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు..ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి రవళి రెడ్డి..కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవి చందర్మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా,సహకార సంఘం మాజీ చైర్మన్ కునురు అశోక్ గౌడ్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కుక్కల నాగరాజు..గ్రామ కమిటీ అధ్యక్షులు నెల్లుట్ల రాజన్న,మాజీ సర్పంచ్ కక్కెర్ల అశోక్, సర్పంచ్ఎండీ అహ్మద్ పాషా,గన్నేర్ల భాస్కర్..యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వంశీ కృష్ణమైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆజ్జు నాగి రెడ్డి, రాం చంద్రు,బుషి గొండ రామస్వామి,నీలం సమ్మయ్య,సొక్కయ్య, బొత్తు దుర్గయ్య,కిరణ్, పెండెల భిక్ష పతి,యూత్ కాంగ్రెస్ నాయకులు కిషోర్, మురళి,.రాజు,వినయ్,రాజు,శివ,ప్రశాంత్, అనీల్,శ్రీను, తదితరులుపాల్గొన్నారు.

పతంజలి భాగస్వామ్యంతో అమలు చేస్తున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించేందుకు శ్రీ అర్జున్ ముండా ఉన్నత స్థాయి సమావేశం

న్యూఢిల్లీ, మే 28:కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ అర్జున్ ముండా, పతంజలి యోగపీఠం ఎండీ మరియు సహ వ్యవస్థాపకులు ఆచార్య బాలకృష్ణ మరియు అతని బృందంతో శాస్త్రి భవన్‌లో గిరిజన ప్రాంతంలో మంత్రిత్వ శాఖ మరియు పతంజలి మధ్య భాగస్వామ్యం పురోగతిని నిన్న సమీక్షించారు. మంత్రిత్వ శాఖకు చెందిన " ఫైనాన్సియల్ అసిస్టెన్స్ ఫర్ సపోర్ట్ టు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) స్కీమ్‌కు" గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పతంజలి సంస్థకు భాగస్వామ్యం ఉంది.

ఈ సమావేశంలో పతంజలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాజెక్టుల ప్రగతి నివేదిక, పరిశోధన, గిరిజనుల సంక్షేమానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై లోతుగా చర్చించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ బిశేశ్వర్ తుడు; కేంద్ర మాజీ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ చంద్ర సారంగి, మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ తమకు కేటాయించిన ప్రాజెక్టులో భాగంగా ఉత్తరాఖండ్‌లోని గిరిజన ప్రాంతాలలో లభించే ఔషధ మొక్కలను గుర్తించి ప్రామాణికతతో డాక్యుమెంట్ చేయడానికి విస్తృత సర్వేలు చేపట్టామని ఈ సమావేశంలో పతంజలి బృందం వివరించింది. సాంప్రదాయ గిరిజన అభ్యాసకులు మంచి పద్ధతులను అనుసరించి మరింత వృత్తిపరమైన పద్ధతిలో మూలికా వైద్యాన్ని అభ్యసించేందుకు వీలుగా సర్వే చేసిన ప్రాంతాలలో సామర్థ్య నిర్మాణాన్ని కూడా చేపడుతున్నట్లు బృందం తెలియజేసింది. ఇది రెండు వైపులా పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి ఉపయోగపడుతుంది. మరియు మంత్రిత్వ శాఖ కేటాయించిన ప్రాజెక్ట్ ప్రకారం డాక్యుమెంటేషన్ కోసం విలువైన సమాచారాన్ని అందించింది. ఇప్పటివరకు, పతంజలి 65,000 మొక్కలను డాక్యుమెంట్ చేసిన అనుభవం ఉంది మరియు మొత్తం 200 గిరిజన సంఘాలతో పని చేసింది.

గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధి, గిరిజన పిల్లలకు విద్యాభివృద్ధి, జీవనోపాధి కోసం శ్రీ ఆచార్య బాలకృష్ణ తన సూచనలను సమావేశంలో సమర్పించారు. పతంజలి దేశానికి సేవ చేయడానికి కట్టుబడి ఉందని, పతంజలిలో చేసిన పరిశోధనలు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగపడతాయని ఆయన అన్నారు. గిరిజన వర్గాల సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా అభివృద్ధి చేయబడిన వాటి గురించి కూడా ఆయన వివరణాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా శ్రీ ఆచార్య బాలకృష్ణ పతంజలి ఆయుర్వేదం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలపై నివేదికలు మరియు పుస్తకాన్ని శ్రీ అర్జున్ ముండాకు అందించారు.

గిరిజన ప్రాంతాల్లో పతంజలి బాధ్యతాయుతంగా చేస్తున్న కృషి నిజంగా అభినందనీయమని శ్రీ అర్జున్ ముండా పేర్కొన్నారు. పతంజలి సూచనలపై సీరియస్‌గా చర్చించాల్సిన అవసరం ఉందని, దీని కోసం కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. దేశంలోని గిరిజన పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు కూడా ఇందులో పాలుపంచుకుంటాయన్నారు. ఇంకా, గిరిజన సంఘాలు, గిరిజన సంస్కృతి, గిరిజన విజ్ఞానం మరియు సంప్రదాయాలకు సంబంధించిన జ్ఞానాన్ని విస్తరించేందుకు గిరిజన పరిశోధనా సంస్థలు తమ పరిధిలో గిరిజన అధ్యయనాలను కూడా చేర్చాలని శ్రీ ముండా అన్నారు. శ్రీ అర్జున్ ముండా మాట్లాడుతూ ఔషధ మొక్కలు అధికంగా ఉన్న గిరిజన ప్రాంతాలలో ఔషధ ప్రణాళికలను పెంచడం మరియు మూలికా ఔషధాలను తయారు చేయడం జీవనోపాధి మిషన్ యొక్క రూపాన్ని అందించాలని అన్నారు.

కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి శ్రీ బిశేశ్వర్ తుడు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా గిరిజనులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారు: మంత్రి ఎర్రబెల్లి

హనుమకొండ, మే 28: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళులర్పించారు. హనుమకొండలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశ్వవిఖ్యాత నటుడిగా, పరిపాలకుడిగా తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవం నిలబెట్టిన మహనుభావుడని, రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు ఇండ్లు ఇచ్చారన్నారు. యువతకు ఆదర్శంగా నిలిచారని, ఆయన సేవలు చిరస్మరనీయమన్నారు.

అనంతరం ఆయన జనగామ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన పల్లెప్రగతి సన్నాహక సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సమావేశానిని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జెడ్పీ చైర్మన్ సంపత్ రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

నిజామాబాద్ నీలకంఠేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్సీ కే.కవిత పూజలు

నిజామాబాద్, మే 28:నిజామాబాద్ నగరంలోని నీలకంఠేశ్వరాలయాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే నెల 4 నుంచి 9వ తేదీ వరకు సీహెచ్ కొండూరులో జరగనున్న లక్ష్మీనరసింహస్వామి లోహమయ శిలామయ విగ్రహ ప్రతిష్టాపన, ఆలయ పునః ప్రారంభోత్సవ వేడుకల తొలి ఆహ్వాన పత్రికను నీలకంఠేశ్వరాలయ స్వామివారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, తమ ఇంటి ఇలవేల్పు అయిన సీహెచ్ కొండూరులోగల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పున ప్రారంభం వచ్చే నెల 4 నుంచి 9 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించబోతున్నామని తెలిపారు.

నిజామాబాద్ జిల్లాలో ఏ కార్యం చేపట్టినా మొదట నీలకంఠేశ్వర ఆలయం స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం ఆనవాయితీ అని, అందుకే స్వామి వారికి ఆహ్వాన పత్రికను అందజేసినట్లు ఎమ్మెల్సీ కవిత చెప్పారు. నీలకంఠేశ్వర ఆలయ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే గణేష్ గుప్తా నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందని వెల్లడించారు. ఆమె వెంట నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ గుప్తా, నిజామాబాద్ మేయర్ నీతు కిరణ్ దండు, స్థానిక నాయకులున్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

హైదరాబాద్, మే 28:రాష్ట్రంలో టీఆర్ఎస్ సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై ఇతర పార్టీలనుంచి నాయకులు గులాబీబాటపట్టారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలోగల ఎమ్మెల్యే గాదరి కిశోర్ నివాసంలో ఆయన సమక్షంలో 40 కుటుంబాలు శనివారం టీఆర్ఎస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరినవారికి ఎమ్మెల్యే గాదరి కిశోర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా గాదరి కిశోర్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయన్నారు. దళిత బంధు పథకాన్ని నిరుపేద దళితులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని గాదరి కిశోర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మండల టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, బొంకూరి సురేశ్, బొజ్జ సాయికిరణ్, చింతకుంట్ల విటల్ మహరాజ్, మందుల నరేశ్, తదితరులున్నారు.

స్కూళ్లు, కాలేజీలకు చేరిన ప్రార్థనా స్థలాల లౌడ్‌స్పీకర్లు!

లక్నో, మే 28: ప్రార్థనా స్థలాల నుంచి లౌడ్‌స్పీకర్లు తొలగించాలని యూపీ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఫిలిబిత్ జిల్లా అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రార్థనా స్థలాల నుంచి తొలగించిన లౌడ్‌స్పీకర్లను స్కూళ్లు, కాలేజీలకు అందచేశారు.

ఎస్పీ దినేష్ కుమార్ ఆదేశాలతో మత పెద్దలు జిల్లాలోని ఆలయాలు, మసీదులు, గురుద్వారల నుంచి లౌడ్‌స్పీకర్లను తొలగించారు. ఈ లౌడ్‌స్పీకర్లను పిలిబిత్‌లోని విద్యామందిర్ కాలేజ్ సహా జిల్లాలోని స్కూళ్లకు అందచేశారు. మత పెద్దల నిర్ణయాన్ని ఎస్పీ ప్రశంసించారు.

స్కూళ్లకు లౌడ్‌స్పీకర్లు ఇవ్వడంతో ఇవి టీచర్లు, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవ వేడుకలతో పాటు స్కూల్ వార్షికోత్సవాలకు ఇతర విద్యా సంబంధ కార్యక్రమాలకు ఉపయోగపడతాయని ఎస్పీ పేర్కొన్నారు. మత పెద్దలు తీసుకున్న నిర్ణయంతో ఇతరులు కూడా అనుసరిస్తూ లౌడ్‌స్పీకర్లను సమర్ధంగా ఉ పయోగించుకునేందుకు పూనుకుంటారని అన్నారు.

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

యాదాద్రి భువనగిరి జిల్లా, మే 28: యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు.

స్వామివారి దర్శనం అనంతరం వారికి గర్భాలయ ముఖమండపంలో ప్రధాన అర్చకులు ఆశీర్వచనాలు ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వారితోపాటు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, నాల్సా మెంబర్ సెక్రటరీ అశోక్ కుమార్ జైన్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి : ఏపీ గవర్నర్

అమరావతి, మే 28: దివంగత నేత ,టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడుఎన్టీఆర్

రాజన్న ఆలయ అధికారులపై సమాచార శాఖ రాష్ట్ర కమిషనర్ అసహనం

రాజన్న సిరిసిల్ల, మే 28:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చిన సమాచార శాఖ రాష్ట్ర కమిషనర్ ను విశ్వహిందూ పరిషత్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో సమాచార హక్కు చట్టాన్ని అమలుకై కృషిచేయాలని కోరారు.. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఆలయ అధికారులను ఇట్టి విషయంపై వివరాలను అడగగా, వారు చెప్పిన వివరణ సంతృప్తిగా లేకపోవడంతోఅధికారులపై అసహనంవ్యక్తం చేశారు. వెంటనే ఆలయ అధికారికార్యాలయంలో సమాచార హక్కు చట్టం వివరిస్తూ బోర్డును ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు గడప కిషోర్ రావు , గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా సంకేపల్లి హరికిషన్

రాజన్న సిరిసిల్ల, మే 28:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ టీఎన్జీఓ స్టేట్ ఎక్జిక్యుటివ్ మేంబర్ గా నియమకైన సందర్భంగా రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా రాజీనామా చేశారు. ఈ నేపద్యంలో ఏఈఓసంకేపల్లి హరికిషన్ ను ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. ఏఈఓ జయకుమారిని సలహారుదారుగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు హరికిషన్ మాట్లాడుతూ ఆలయ ఉద్యోగుల ఐక్యతను ఎవరు చెడ్డగోట్టాలని చూసినా సహించేది లేదని అన్నారు. అధికారులు, ఉద్యోగులను అనవసరంగా వేధిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఈఓలు జయకుమారి, ప్రతాప నవీన్, ఉపాధ్యాయుల చంద్ర శేఖర్, పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, వరి నర్సయ్య, గుండి హరిహారనాథ్, గుండి నరసింహ మూర్తి, అరుణ్ వెల్ది సంతోష్, పూజిత రాజశేఖర్, గోలి శ్రీనివాస్, నాగుల మహేష్, తిరుపతి రావు ,ఏఈ రాంకిషన్ రావు, సీనియర్ అసిస్టెంట్ లు పేరుక శ్రీనివాస్, నూగురి నరేందర్, నునుగొండ రాజేందర్, ఒన్నారం భాస్కర్, నక్క తిరుపతి, లింగంపల్లి రాజేందర్, మర్రిపల్లి లక్ష్మీనారాయణ, కమలాకర్, పెంట శ్రీనివాస్, పట్టెముల లచ్చయ్య ఉన్నారు.

శ్రీరామ రథోత్సవంలో అపశృతి.. విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి

నల్లగొండ, మే 28: నాంపల్లి మండలం కేతేపల్లిలో శనివారం నిర్వహించిన శ్రీరామ రథోత్సవ కార్యక్రమంలో అపశృతి చోటు చేసుకుంది. రథం పైభాగానికి విద్యుత్ తీగలు తాకడంతో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో రథంపై ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. మృతులను రాజబోయిన యాదయ్య, పొగాకు మోహనయ్య, దాసరి ఆంజనేయులుగా గుర్తించారు. కన్నుల పండువగా సాగుతున్న వేడుకలో ఈ అపశృతి చోటు చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

తెలుగు రైటర్స్ అసోసియేషన్, మహారాష్ట్ర (త్వమ్)
TELUGU WRITERS ASSOCIATION, MAHARASHTRA (TWAM)
ఆహ్వానం
పుస్తకావిష్కరణోత్సవం
తేది: 29 మే, 2022
:వేదిక:
కొహినూర్ మంగళ కార్యాలయం,
దాదర్(ఈస్ట్) స్టేషన్ ఎదురుగా..
సమయం: సా॥6 గం॥నుండి 10 వరకు.
34 గోఖలేరోడ్ నార్త్
కథా సంపుటి
డా॥తాటి నరహరి
నిర్బంధ కాలం
కవితా సంపుటి
సంగెవేని రవీంద్ర
ముఖ్య అతిథి
శ్రీ జూలూరి గౌరీశంకర్‌గారు
(చైర్మన్, తెలంగాణ సాహిత్య అకాడెమీ)
సభాధ్యక్షులు
శ్రీ మాదిరెడ్డి కొండారెడ్డిగారు
(ప్రధాన కార్యదర్శి, తెలుగు కళా సమితి, నవీ ముంబై)
గౌరవ అతిథి
శ్రీ పి.చంద్రశేఖర్ ఆజాద్‌గారు
(కథ, నవల, సినీ రచయిత)
: విశిష్ట అతిథులు :
శ్రీమతి రవీణా చవాన్‌గారు
(అధ్యక్షులు, త్వమ్)
డా॥ దూస కుమార్‌గారు
(అధ్యక్షులు, తెలుగు డాక్టర్స్ అసోసియేషన్)
శ్రీమతి తురగా జయశ్యామలగారు
(ప్రముఖ రచయిత్రి)
శ్రీ ఎ.వి.అనంతరామ్‌గారు
(కవి, ప్రముఖ వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్)
ఈ కార్యక్రమానికి తమరిని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.
: ఆహ్వానించువారు :
డా॥తాటి నరహరి
రవీణా చవాన్
అధ్యక్షులు
త్వమ్
సంగెవేని రవీంద్ర
ప్రధాన కార్యదర్శి
(ఆత్మీయ భోజనం ఉంటుంది)

మానవ మనుగడను శాసించేది రుతుచక్రం : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, మే 28: మీ నిశ్శబ్దం వీడండి.. బహిరంగంగా చర్చించండి.. రుతుప్రేమ ప్రయోజనాలు వివరించండి.. రుతుప్రేమ లేకపోతే.. జీవనమే లేదు. మానవ మనుగడను శాసించేది రుతుచక్రమే అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో రుతు ప్రేమ ప్రారంభ కార్యక్రమానికి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ మేరకు ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణంతో పాటు స్వచ్ఛ సిద్ధిపేట జిల్లాకు పాటు పడదామని దిశానిర్దేశం చేశారు. మీకు ఆరోగ్య వంతమైన, సౌకర్యవంతమైన, శాస్త్రీయమైన రుతుచక్రం పై మీకు అవగాహన కల్పించేందుకు ఈ రుతుప్రేమ కార్యక్రమం చేపట్టామని రాష్ట్ర మంత్రి శ్రీ హరీశ్ రావు చెప్పారు.

సిద్ధిపేట జిల్లాలో ఇప్పటికే 3 వేల మందికి రుతుప్రేమ మెన్స్రు వల్ కప్పులు అందించినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలోని మహిళా పంచాయతీ కార్యదర్శిలు, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఏంలు అలాగే మహిళా గ్రామ సర్పంచ్‌లు, ఏంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు పట్టుబడితే.. కానిదేమీ లేదు. రుతుప్రేమ విజయవంతం చేసేందుకు మీరంతా నడుం బిగించాలని మంత్రి పిలుపునిచ్చారు. మొదట మీరు ఉపయోగిస్తే.. మోటీవేటర్లుగా.. అందరిలో స్ఫూర్తిని నింపిన వారవుతారని మంత్రి పేర్కొన్నారు. త్వరలోనే అన్నీ కస్తూర్బా, రెసిడెన్షియల్ పాఠశాలలలోని విద్యార్థినులకు రుతుప్రేమ కప్పులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పాటు పడటంతో పాటుగా మీ ఆరోగ్య రక్షణ చేయాలన్నదే మా ధ్యేయమని మంత్రి చెప్పారు.

తెలుగు రాష్ట్రాలు సంతోషంగా ఉన్నాయంటే ఎన్టీఆర్ చలవే : కేసినేని నాని

న్యూఢిల్లీ, మే 28: తెలుగు రాష్ట్రాలు సంతోషంగా ఉన్నాయంటే అది మహానేత ఎన్టీఆర్ చలవేనని, వెయ్యేళ్లైనా ఆయనను ప్రజలు గుర్తు పెట్టుకుంటారని విజయవాడ టీడీపీ ఎంపీ కేసినేని నాని హర్షం వ్యక్తం చేశారు. నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా శనివారం ఆయన టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నౌపాడ సత్యనారాయణతో కలిసి పార్లమెంట్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి, టీడీపీ కార్యాలయంలోని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ కేసినేని నాని మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ జన్మించి 99 ఏళ్ళు అయిపోయిందా అన్నట్లు ఉందన్నారు. సినిమా, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఎన్టీఆర్ తెలుగు ప్రజల మనసుల్లోనే కాక ప్రతి భారతీయుడి హృదయంలో స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఎన్టీఆర్ జీవన శైలి ప్రపంచానికే ఆదర్శమని? ప్రజలు, సమాజం, వ్యవస్థ కోసం జీవించారని నాని చెప్పుకొచ్చారు. ప్రభుత్వోద్యోగం వచ్చినా వద్దనుకుని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సినీ రంగాన్ని ఎంచుకున్నారని అన్నారు. రాముడు, కృష్ణుడు, సుయోధనుడు, ఇలా ఏ పాత్రకైనా ఎన్టీఆర్‌ను మించిన వ్యక్తి ఈ ప్రపంచంలో లేరని హర్షం వ్యక్తం చేశారు. నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా ఆయన చేసిన సేవలను ఎంపీ నాని గుర్తు చేశారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు పార్టీ పెట్టి 9 నెలల్లో అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి మహిళలు, పేదలు, వెనుకబడిన వర్గాల కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారని వివరించారు. సీఎంగా ఎన్టీఆర్ చేసిన సంస్కరణలు ఎవరు చేయలేదని, ఆయన సంస్కరణలే నేటికీ అమలవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఆశయాలను

చంద్రబాబునాయుడు ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. ఎన్టీఆర్‌కు మరణం లేదన్న నాని, ఆయన ఎప్పుడూ ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారని తెలిపారు.

అమరావతిని సందర్శించిన తెలంగాణ మంత్రి గంగుల

కరీంనగర్ , మే 28:(కరీంనగర్ లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వరస్వామి మందిర నిర్మాణం అతి త్వరలోనే కార్యరూపం దాల్చబోతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు(బిబిట ఎనీజీతీట) నిధులతో వారి ఆధ్వర్యంలో నిర్మించబోయే ఈ ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయిన్పల్లి వినోద్ కుమార్, ఎంపీ దామోదరరావు, టిటిడి బోర్డు తెలంగాణ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ భాస్కర్ రావు ఈరోజు అమరావతిలో నిర్మాణంలో ఉన్న వెంకటాచల టిటిడి ఆలయాన్ని సందర్శించారు. ఎకరా విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఆలయ ప్రాంగణాన్ని అణువణువు పరిశీలించారు.

ఈసందర్భంగా ఆగమ, వాస్తు శాస్త్రం, ఆలయ నిర్మాణ శైలి, గర్భాలయం, అంతరాలయం, అర్థ మండపం, మహా మండపం, ముఖమండపం, గరుడాళ్వార్ సన్నిధి, ధ్వజస్తంభం, బలిపీఠం, తూర్పు రాజ గోపురం, ఉత్తర ద్వారం, ప్రాకార మండపాలు తదితర నిర్మాణ విశిష్టతలను ఆలయ స్థపతులను అడిగి తెలుసుకున్నారు. గతంలో జూబ్లీహిల్స్ టిటిడి ఆలయంతో పాటు కొన్నిఇతర ఆలయ నిర్మాణాలను సైతం పరిశీలించారు.కరీంనగర్ నగరం నడిబొడ్డున 100 కోట్ల విలువ చేసే పది ఎకరాల స్థలాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ టిటిడి ఆలయ నిర్మాణం కోసం ఇదివరకే కేటాయించారు, ఈ ఆలయ నిర్మాణానికి టిటిడి బోర్డు సైతం గతంలోనే ఆమోదం తెలిపింది. గతంలో జూబ్లీహిల్స్ టిటిడి ఆలయాన్నికూడా వారు పరిశీలించారు, అందులో భాగంగా ఈరోజు నిర్మాణంలో ఉన్న అమరావతి ఆలయాన్ని సందర్శించారు.

టీటీడీ స్థపతులు, కరీంనగర్ రెవెన్యూ యంత్రాంగం, యాదాద్రికి పనిచేసిన ఆనంద్ సాయి తదితరులు కరీంనగర్లో ఆలయనిర్మాణం జరగబోయే స్థలాన్ని పరిశీలించి డిజైన్లు ఇవ్వాల్సిందిగా మంత్రి గంగుల ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి బృందాన్ని స్థానిక ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ అమరావతి ఆలయం కన్నా మరింత సుందరంగా, మరింత విశాలంగా ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం టీటీడీ ఆధ్వర్యంలో కరీంనగర్ ఆలయాన్ని నిర్మిస్తామన్నారు, ఇప్పటికే పూర్వ కరీంనగర్ జిల్లాలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాలేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలకు దీటుగా కరీంనగర్ టిటిడి ఆలయం ఉండబోతుంది అన్నారు.

ఏఎల్ఎఫ్ ఆర్పీలు, ఓబీలకు రుతుక్రమముపై అవగాహన

రాజన్న సిరిసిల్ల, మే 28:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ కార్యాలయం లో ఋతు క్రమ పరిశుభ్రత రోజును యంలో సీడీఎంఏ ఆదేశాలమేరకు శనివారం అన్నయాన్ని ప్రజలకు వివరించి, ప్రజలను చైతన్య పరచాలని కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను, పేద ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నాయని, వెంటనే ఆ ప్రభుత్వాలకు తగిన రీతిలో ప్రజలందరూ బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు గిట్టుబాటు ధర అందించి ఆదుకుంటామని అన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలతో తీరుతో సామాన్యుడు బ్రతకడం కష్టంగా ఉందని, పప్పులు, ఉప్పులు, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అందుకు రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుక రమేష్ ,కూరగాయలు కొమురయ్య, కనికరపు రాకేష్, కూర దేవయ్య, లింగంపల్లి కిరణ్, దాడి మల్లేశం, గే0టల ప్రకాష్, నక్క భూమయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే రైతులు, పేద ప్రజలకు న్యాయం

- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి

రాజన్న సిరిసిల్ల, మే 28:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణం బాల్ నగర్ గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ

శ్రేణులు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన రైతు డిక్లరేషన్ సంబంధించిన విషయాలను ప్రజలకు తెలిపారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకట స్వామి మాట్లాడుతూ రైతులకుజ్ పేద ప్రజలకు న్యాయం జరగాలి అంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని ప్రజలను కోరారు. వరంగల్ రాహుల్ గాంధీ సభలో రైతు డిక్లరేషన్

మధ్యాహ్న భోజన పథకంలో రాగి జావ పెట్టాల్సిందే - తెలంగాణ సర్కార్

హైదరాబాద్, మే 28:ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు రాగి జావ, మొలకలు-బెల్లం అందజేయాలని నిర్ణయం తీసుకుంది తెలంగాణ ప్రభుత్వం. పిల్లల్లో పోషకాహార లోపం నివారణకు మధ్యాహ్న భోజనానికి అదనంగా 2019-20లో రాగి జావ, 2021-22లో రాగిజావ, పల్లీ పట్టి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా?కేంద్రం ఆమోదించింది. అయినా అమలుచేయకుండా రాష్ట్ర విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఎందుకు అమలు చేయలేదని కేంద్ర విద్యాశాఖ కూడా ప్రశ్నించడం లేదు. ఈ నేపథ్యంలో ఈసారైనా పిల్లల నోటికి రాగి జావ, మొలకలు-బెల్లం అందేనా అన్న సందేహం వ్యక్తమవుతోంది.

పాఠశాలలలో విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్నం పూట భోజన సదుపాయం కలిపించే ప్రభుత్వ విధానాన్ని మధ్యాహ్న భోజన పథకము అంటారు. పేద బాల బాలికలు పేదరికం కారణంగా పాఠశాలకు వెళ్ళడం మానివేయకూడదనే ఉద్దేశంతో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకం ఇది. ఇందులో అన్ని పని దినాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా భోజనం పెడతారు. బాలబాలికలను ఆకలి బాధ నుంచి దూరం చేయడం, పాఠశాలలో చేరేవారి సంఖ్యను, హాజరు అయ్యేవారి సంఖ్యను పెంచడం, పిల్లల్లో సామాజిక సమ భావన పెంపొందించడం, పౌష్టికాహార లోపాన్ని తగ్గించడం, ఈ పథకం యొక్క ముఖ్య లక్ష్యాలు.

నల్గొండలో విషాదం : రథానికి కరెంట్ తీగలు తగిలి ముగ్గురు మృతి

నల్గొండ ,మే 28 నల్గొండ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆలయ రథాన్ని తరలించే క్రమంలో అపశ్రుతి నెలకొంది. నాంపల్లి మండలం కేతేపల్లి వద్ద ఓ ఆలయం సమీపంలో శనివారం ప్రమాదం సంభవించింది. శ్రీరామ రథోత్సవంలో రథాన్ని రథశాలకు చేర్చుతుండగా కరెంట్ తీగలు తగిలాయి.

దీంతో విద్యుత్ షాక్ తగిలి.. రథం లాగుతున్న వ్యక్తుల్లో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారు.. కేతేపల్లి గ్రామానికి చెందిన రాజాబోయిన యాదయ్య (42), పొగాకు మొనయ్య (43), మక్కలపల్లికి చెందిన కారు డ్రైవర్ దాసరి అంజి (20)గా గుర్తించామన్నారు. క్షతగాత్రులకు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి, మృతదేహాలను మార్చరీకి తరలించామన్నారు.

రాజన్న సేవలో సమాచార శాఖ కమిషనర్ డా. గుగులోత్ శంకర్ నాయక్

రాజన్న సిరిసిల్ల, మే 28:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శనివారం తెలంగాణ సమాచార శాఖ కమిషనర్ గుగులోత్ శంకర్ నాయక్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆయనకు వేదోక్త ఆశీర్వచనం చేసి, శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.

యోగి ఆదిత్యానాథ్ యూపీ గబ్బర్ సింగ్ : టీఎంసీ

కోల్‌కతా, మే 28: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన హింసాకాండపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ చేసిన వ్యాఖ్యలకు బెంగాల్ మంత్రి ఫిర్హాద్ హకీం దీటుగా బదులిచ్చారు. యోగి ఆదిత్యానాథ్ యూపీ గబ్బర్ సింగ్ అని, యూపీలో మాట్లాడేందుకు ఎవరికీ ధైర్యం లేదని అన్నారు. విపక్ష నేతలను జైళ్లలో బంధిస్తున్న వారు బెంగాల్ హింస గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

బెంగాల్‌లో హింసకు చోటులేదని, బెంగాలీలు ప్రపంచానికి శాంతిని బోధించారని మంత్రి హకీం గుర్తుచేశారు. యోగి ఆదిత్యానాథ్ తమ రాష్ట్రానికి వచ్చి పాలన గురించి తమ సీఎం మమతా బెనర్జీ నుంచి నేర్చుకోవాలని హితవు పలికారు. మీరు మతం పేరుతో ఎన్నికలకు వెళతారు..ఎన్‌కౌంటర్లు చేస్తారని దుయ్యబట్టారు. తాము అభివృద్ధి అంశాలే అజెండాగా ఎన్నికలకు వెళతామని టీఎంసీ నేత పేర్కొన్నారు.

కాగా బెంగాల్‌లో ఎన్నికల అనంతర హింసను ప్రస్తావించినందుకు యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్‌కు బెంగాల్ విపక్ష నేత, బీజేపీ నాయకుడు సువేందు అధికారి ధన్యవాదాలు తెలిపారు. తమకు సంఘీభావంగా నిలిచినందుకు యోగికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. యూపీ అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి బదులిస్తూ బెంగాల్ హింసపై యోగి ఆదిత్యానాథ్ మాట్లాడారు. బెంగాల్ తరహాలో యూపీలో ఎన్నికల అనంతరం హింసాకాండ చోటుచేసుకోలేదని చెప్పుకొచ్చారు. ఇది యూపీలో శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉందనేది వెల్లడిస్తుందని అన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలలో సీఎస్ కెఐ క్రీడాకారులకు పతకాలు

కరీంనగర్ , మే 28:(నేటినిజం ప్రతినిధి): మలేషియాలోని ఐపో నగరంలో ఈ నెల 27వ తేది నుండి 29వ తేదీ వరకు జరుగుతున్న అంతర్జాతీయ కరాటే పోటీలలో కరీంనగర్ జిల్లా నుండి కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా నేషనల్ అకాడమీ నుండి నలుగురు క్రీడాకారులు పాల్గొని, పతకాలను సాధించారు. ఇందులో అండర్ 17లో జూనియర్స్ క్యాటగిరిలో కె పావని, డి రిషికేశ్వర్ లు కరాటేలో బంగారు పతకాలు సాధించారు. కాగా పతకాలు సాధించిన క్రీడాకారులను సీఎస్ కెఐ ఛైర్మన్, కరాటే సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సీఎస్ కెఐ ఇండియా చీఫ్ అండ్ కాయ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ, తెలంగాణ కాయ్ ప్రధాన కార్యదర్శి ఈ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్ లు అభినందించారు.

కామన్ డయాస్, హైదరాబాద్
(సాహిత్యం-విద్య-నేవ-జర్నలిజం)
ఐ.నెం. 1295/2013
రవ్వలకొండ (విశ్వబ్రాహ్మణ వేదిక)
తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో
తంగెళ్ళపల్లి కనకాచారి రచన
పుష్పాంజి పాడాలు
(కవితా సంకలనం)
ఆవిష్కరణ
ముఖ్య అతిథి శ్రీ డా॥ కె.వి. రమణాచారి, ఐఏఎస్ (ర) గారు
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
సభాధ్యక్షులు - శ్రీ బి.ఆర్ చారి గారు,
తెలంగాణ తల్లి రూప శిల్పి
ఎ.శిష్ట అతిథులు
శ్రీమతి పైడిపల్లి భీమన్న గారు,
భీమన్న సాహితీ నిధి వ్యవస్థాపకులు
శ్రీమతి కె. ప్రసన్న రామచారి గారు,
చైర్‌పర్సన్, నగర గ్రంథాలయ సంస్థ, హైదరాబాద్
శ్రీమతి పి. పద్మజ గారు,
కార్యదర్శి, నగర గ్రంథాలయ సంస్థ, హైదరాబాద్
శ్రీ జాలూరి గౌరీశంకర్ గారు,
అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి
శ్రీ మామిడి హరికృష్ణ గారు,
డైరెక్టర్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ
శ్రీ ఎం. వేదకుమార్ గారు,
చైర్మన్, దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్
శ్రీమతి డా॥ పి. హంస,
అసిస్టెంట్ ప్రొఫెసర్, కోఠి మహిళా కళాశాల
శ్రీ వేములవాడ మదన్‌మోహన్,
అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ సంఘం
శ్రీ ఎ.వి. జనార్దన్ రావు గారు,
జర్నలిస్టు/అనువాదకుడు
ఆగమనాభిలాషులు
టి.ఎస్. విద్యాసాగర్, అధ్యక్షులు
మంగళాపురపు వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి
రవ్వలకొండ (విశ్వబ్రాహ్మణ వేదిక)
తంగెళ్ళపల్లి కనకాచారి, అధ్యక్షులు
రమాదేవి, ప్రధాన కార్యదర్శి
కామన్ డయాస్, హైదరాబాద్
Cell:
8790874028
7013268047
వేదిక: రవీంద్రభారతి మొదటి అంతస్తు, సమావేశ మందిరం
జూన్ 12, ఆదివారం, 2022
సమయం: ఉ॥గం॥ 10-00 నుండే మగం॥ 1-00 వరకు
అందరూ ఆహ్వానితులే

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.